క్లుప్తంగా

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు

చాగల్లు: మండలంలోని చిక్కాల గ్రామంలోని 0515009 నెంబరు గల రేషన్ షాప్‌లో సివిల్ సప్లయిస్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం నిల్వల్లో తేడాలను గుర్తించినట్టు సివిల్ సప్లయిస్ డీటీ ఎం.సునీత తెలిపారు. 300 కిలోల బియ్యం స్టాక్‌లో లేకపోవటంతో షాప్ డీలర్ పి.భాగ్యలక్ష్మిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

జనరేటర్ ప్రారంభం



జనరేటర్ ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యాన స్థానిక రోటరీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రూ.15 లక్షల విలువైన 125 కేవీ జనరేటర్‌ను మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ శనివారం ప్రారంభించారు. పూర్వ జిల్లా గవర్నర్ రొటేరియన్ వి.భాస్కరామ్ విరాళంతో పాటు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ సొంత నిధులతో ఈ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. రోటరీ సమావేశాలకు, వినియోగదారుల శుభకార్యాలకు ఇబ్బందులు కలగకుండా జనరేటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

నిడదవోలు: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన స్థానిక ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ఉచిత కంప్యూటర్ శిక్షణకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ ఆపరేషన్ కోర్సులలో ఈ శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి జరిగే ఈ శిక్షణ తరగతులకు పదో తరగతి కనీస అర్హత కలిగిన యువతీ యువకులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 96760 52454, 912171 4649 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పండగ ప్రశాంతంగా చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి

నిడదవోలు: ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండగ చేసుకోవాలని కొవ్వూరు డీఎస్పీ కె.శ్రీనివాసమూర్తి కోరారు. బక్రీద్ సందర్భంగా నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ముస్లిం పెద్దలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బక్రీద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎవరైనా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో సీఐ వి.జానకిరామయ్య, పట్టణ ఎస్సై పి.అప్పాలరాజు, సమిశ్రగూడెం ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

నిడదవోలు రూరల్: చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సమిశ్రగూడెం సెక్టార్ సూపర్‌వైజర్ పి.నళిని సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం, గోపవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం వల్ల చిన్నారుల్లో సృజనాత్మకత, ఊహాశక్తి పెంపొందుతాయన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తాళ్లపూడి: మండలంలోని పాఠశాలల విద్యార్థులకు యోగా దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడిలోని గాయత్రీ యోగా సమితి ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలల్లో ఈ నెల 21 యోగా దినోత్సవం వరకూ విద్యార్థులకు యోగా పోటీలు, చెస్, రన్నింగ్, క్విజ్ తదితర పోటీలను రోజూ ఉదయం 6 గంటలకు, సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహిస్తున్నారు. దాంట్లో భాగంగా శనివారం వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగా, చదరంగం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ బాలామణి, ఉపాధ్యాయులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి బొట్టు.. ఒడిసిపట్టు

- జిల్లావ్యాప్తంగా రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల ఏర్పాటు
- ముందుగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇంకుడుగుంతలు



నల్లజర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్



ఉపాధి హామీ కూలీలతో తవ్విస్తున్న ఇంకుడుగుంత

నల్లజర్ల: జలమే జీవకోటికి జీవనాధారం.. నీరు లేని చోట జీవం మనుగడ సాధ్యం కాదు. నీటిని సంరక్షిస్తేనే భవిష్యత్ తరాలకు భరోసా కలిగేది. అందుకే ప్రతి నీటి బొట్టు పదిలమే.. ప్రతిఒక్కరూ వృథాగా పోతున్న నీటిని ఒడిసి పడితేనే తమ పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసినవారవుతారు. ప్రస్తుతం ఎక్కడికక్కడ భూగర్భజలాలు అడుగంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో గతేడాది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూఫ్ వాటర్ హార్వెస్టర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

ఒక్కో స్ట్రక్చర్‌కు రూ.42 వేలు

జిల్లావ్యాప్తంగా రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల ఏర్పాటుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎర్త్ వర్క్, మెటీరియల్, ఉపాధి కూలీల వేతనాలు, పైపులైను వేయడానికి మొత్తంగా రూ.42 వేల ఖర్చుతో రెండున్నర మీటర్ల వైశాల్యం ఉన్న ఒక్కో స్ట్రక్చర్ నిర్మిస్తున్నారు.

నల్లజర్ల మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల వద్ద ఇప్పటికే ఆయా ఇంకుడుగుంతలను పూర్తి చేశారు. వర్షాకాలంలో కురిసిన వర్షపు నీరు వృథాగా పోకుండా నేరుగా రూఫ్‌వాటర్ హార్వెస్టర్ స్ట్రక్చర్ ద్వారా భూమిలోకి వెళ్లేలా నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ ప్రాంగణాలు వర్షపు నీటితో అధ్వానంగా మారకుండా వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకించి భూగర్భజలాలను సంరక్షించేందుకు జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది.

ఇళ్ల వద్ద ఇంకుడుగుంతల ఏర్పాటు

ప్రభుత్వం పేదలకు స్థలాలిచ్చి ఏర్పాటుచేసిన లేఅవుట్లలో నిర్మించే గృహాల వద్ద ఇంకుడుగుంతలు నిర్మించే ఏర్పాట్లు చేశారు. మండలంలోని పోతవరంలో ఇప్పటికే కొన్ని ఇళ్ల వద్ద ఇంకుడుగుంతల నిర్మాణం పూర్తయింది. ఇంటి ఆవరణలో ఉన్న స్థలాన్ని బట్టి ఒకటి లేదా రెండు మీటర్ల వెడల్పు గల ఒరలు ఏర్పాటుచేసి దాంట్లో చిన్నసైజు రాళ్లు, కొబ్బరి పీచు, బొగ్గు, ఇసుక పొరలుగా వేస్తున్నారు. ఇంటి పైఆవరణలో కురిసిన వర్షపు నీరు నేరుగా ఇంకుడుగుంతలోకి చేరేలా ఏర్పాటుచేస్తున్నారు. ఈ స్ట్రక్చర్‌కు ప్రభుత్వం రూ.6 వేలు అందిస్తుంది.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద పూర్తి



భూగర్భ జలసంరక్షణ అనేది ఎంతో అత్యవసరం. భూతాపాన్ని నివారించేందుకు, భవిష్యత్తు తరాలకు భూగర్భజలాలను సమృద్ధిగా అందించేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. ప్రభుత్వ కార్యాలయాల వద్ద రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను ఇప్పటికే పూర్తి చేశాం.

– టి.వెంకట్రావు, ఏపీఓ, ఉపాధి హామీ, నల్లజర్ల

భూగర్భజలాలు పెరుగుతాయి



ఇంటి పైకప్పుపై కురిసిన వర్షం నీరు వృథాగా పోకుండా కొద్దిపాటి శ్రమతో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసి వర్షపునీటిని అందులోకి ఇంకించవచ్చు. దీనికి పెద్దగా పెట్టుబడి కూడా అవసరం లేదు. దీనివల్ల కలిగే ప్రయోజనాలు మాత్రం ఎంతో అధికం. ఇంకుడుగుంతలున్న చోట భూగర్భ నీటిమట్టం గణనీయంగా పెరుగుతుంది.

– ఎం.శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్, నల్లజర్ల

నిర్ణీత సమయంలో వ్యాక్సినేషన్ చేపట్టాలి



పీహెచ్‌సీలో వ్యాక్సిన్ నిల్వ చేసిన గదిని తనిఖీ చేస్తున్న డాక్టర్ రాజకుమారి

ఉండ్రాజవరం: ప్రాణాంతక వ్యాధులు దరి చేరకుండా, రోగ నిరోధక శక్తిని పెంచేందుకు నిర్ణీత సమయంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎస్.రాజకుమారి అన్నారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్ నిల్వ చేసిన గదిని పరిశీలించారు. సాధారణ కాన్పులు పెంచాలని సూచించారు. ఉధృత అతిసార నియంత్రణ (ఐడీసీఎఫ్) కార్యక్రమంపై పీహెచ్‌సీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్.ఉషాదేవి మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ తిరిగి డయేరియాతో బాధ పడుతున్న ఐదేళ్ల లోపు పిల్లలను సకాలంలో గుర్తించి, చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చునని అన్నారు. అనంతరం మోర్త గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని డాక్టర్ రాజకుమారి పరిశీలించి, తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రమణ్యం, పబ్లిక్ హెల్త్ నర్స్ కె.కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలను కప్పేసిన గుర్రపు డెక్క



మురుగుకాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

ఉండ్రాజవరం: సాగు, మురుగు నీరు వెళ్లాల్సిన మురుగు కాలువలను గుర్రపు డెక్క, తూడు అల్లేసి నీటిపారుదలకు తీవ్ర అడ్డంకిగా మారాయి. సార్వా సమయంలో మురుగునీరు, దాళ్వా సమయంలో సాగునీటి పారుదల కోసం ఈ కాలువలను రైతులు వినియోగిస్తారు.

ఉండ్రాజవరం, మోర్త, తాడిపర్రు, చివటం తదితర గ్రామాల్లో ఉన్న మురుగుకోడులను గుర్రపు డెక్క, తూడు పూర్తిగా కప్పేయడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ కాలువల ద్వారా నీరు లాగకపోతే తమ పంట పొలాలు మునిగి పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకంలో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇసుక అక్రమ తరలింపుపై కేసు

- రెండు లారీలు సీజ్
- ఆరు లారీల ఇసుక స్వాధీనం



ఎరినమ్మ ర్యాంపులో ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్, సీఐ

కొవ్వూరు: పట్టణ శివారున ఉన్న ఎరినమ్మ ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలించినట్లు మైన్స్ ఏడీ ఎ.సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై ఎండీ జుబేర్ తెలిపారు. ఇసుక లోడుతో ఉన్న రెండు లారీలు, ఒక పొక్లెయిన్, లోడింగ్ ట్రాక్టర్, 126 క్యూబిక్ మీటర్ల ఇసుక స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎస్ఈబీ, రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు సంయుక్తంగా ర్యాంపును పరిశీలించారు. ర్యాంపు నుంచి తరలించిన ఇసుకను వేములూరు సమీపంలోని లే అవుట్‌లో నిల్వ చేసినట్లు గుర్తించారు. ఇసుక నిల్వలను తహసీల్దార్ కె.మస్తాన్, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, ఇతర అధికారులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

- మునిసిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి
- కౌన్సిల్ సమావేశంలో 22 అంశాలకు ఆమోదం



మునిసిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు: పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నామని మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. పురపాలక సంఘం సాధారణ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ హాలులో నిర్వహించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. పారిశుధ్య కార్మికుల హాజరు సచివాలయాల్లో కాకుండా మునిసిపల్ కార్యాలయం వద్ద తీసుకునేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని సూచించారు. అజెండాలో 25 అంశాలు ఉండగా, మూడింటిని వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ రత్నకుమారి ప్రకటించారు. మిగిలిన 22 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ప్రధానంగా మునిసిపల్ దుకాణాల అద్దెను బహిరంగ మార్కెట్ కంటే తక్కువ నిర్ణయిస్తున్నారని, దీనిని మరింత పెంచాల్సి ఉందని సభ్యులు సూచించారు. దీంతో ఈ అంశాన్ని వాయిదా వేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ఒక వ్యక్తి తన భూమిని పారిశ్రామిక వినియోగం నిమిత్తం మార్పు చేయాలని పెట్టిన ప్రతిపాదనను కూడా వాయిదా వేశారు. దీనికి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కంఠమణి రమేష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. బాపూజీ కూరగాయల మార్కెట్‌లో దుకాణాల లీజు అంశాన్ని కూడా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

జువైనల్ జస్టిస్ యాక్ట్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి శివకుమార్

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థలో శనివారం జువైనల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివ కుమార్ మాట్లాడుతూ జువైనల్ జస్టిస్ యాక్ట్‌పై స్పష్టమైన అవగాహన అవసరమన్నారు. ఈ చట్టంలోని నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘించిన వారు చట్టానికి జవాబుదారులు అవుతారన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ నల్సా వారి చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ అండ్ దేర్ ప్రొటెక్షన్ యాక్ట్ గురించి వివరించారు. ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ జానీబాషా మాట్లాడుతూ పోలీసు అధికారులకు జువైనల్ జస్టిస్ యాక్ట్ నిబంధనలు, ఈ కేసులను ఏ విధంగా త్వరితగతిన పూర్తి చేయాలో వివరించారు. 3వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సి.రమ్య మాట్లాడుతూ పోలీసు అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ అధికారుల విధులను తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, దిశ వుమెన్ పోలీసు స్టేషన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.ఆదినారాయణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ పి.సూర్యప్రభావతి, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యురాలు తబిత పాల్గొన్నారు.

నేను బడికిపోతా ప్రత్యేక డ్రైవ్



గోపాలపురంలో స్పెషల్‌డ్రైవ్‌లో బాలికను బడిలో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

గోపాలపురం: నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13వ తేదీ నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం గోపాలపురం పెద్దగూడెంలో ప్రత్యేక డ్రైవ్‌లో బడి బయట పిల్లల గుర్తింపులో భాగంగా బాలిక చినమర్తి వెంకమ్మను బడిలో చేర్పించారు. వచ్చే నెల 12వ తేదీ వరకూ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. తల్లిదండ్రులంతా వారి పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. ప్రతి పాఠశాల పరిధిలోని ఉపాధ్యాయులు డ్రైవ్‌లో పాల్గొని బడిఈడు పిల్లలను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం టీవీ సత్యనారాయణ, అమలాపురపు వెంకటేసులు, సీఆర్‌పీ కొయ్య నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి జాతర



అమ్మవారిని ఆలయం నుంచి నడివీధికి తీసుకొస్తున్న గ్రామస్తులు

దేవరపల్లి: మండలంలోని బందపురంలో గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. గత నెల 28న అమ్మవారిని ఆలయం నుంచి నడివీధికి తీసుకొచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూరిగుడిసెలో ప్రతిష్ఠించారు. అమ్మవారికి పూజలు నిర్వహించి, చీరలు, పసుపు, కుంకుమలు, చలివిడి, పానకాలను సమర్పించారు. రాత్రి 8 గంటలకు బలిచేట కార్యక్రమం ప్రారంభించారు. మూడు సార్లు బలిచేటను గ్రామ పొలిమేరలో తిప్పి నడివీధి(పుట్టిల్లు)లో గల అమ్మవారిని తిరిగి(అత్తవారి ఇల్లు) ప్రధాన ఆలయానికి తీసుకెళ్లి ప్రతిష్ఠించారు. గ్రామ ఆడపడుచులు, బంధువులు, మిత్రులు కుటుంబ సమేతంగా గ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో జాతర సందడి నెలకొంది. ఆదివారం అమ్మవారికి నైవేద్యాల సమర్పణతో జాతర మహోత్సవాలు ముగుస్తాయని గ్రామస్తులు తెలిపారు. దేవరపల్లి సీఐ పి.బాలసురేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.శ్రీహరిరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కువైట్ మృతుల కుటుంబాలకు పరిహారం



అన్నవరప్పాడులో మృతుని కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి: కుటుంబ పోషణకు కువైట్ వెళ్లి, అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవటం చాలా బాధాకరమని, వారి కుటుంబాలకు అండగా ఉంటామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కువైట్‌లో ఈ నెల 12న జరిగిన అగ్ని ప్రమాదంలో మండలంలోని అన్నవరప్పాడుకు చెందిన మీసాల ఈశ్వరరావు, ఖండవల్లి గ్రామానికి చెందిన మొల్లేటి సత్యనారాయణ మృతి చెందిన విషయం తెలిసిందే. స్వగ్రామాలకు శనివారం చేరిన మృతదేహాలకు మంత్రి దుర్గేష్ శనివారం నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, రూ.5 లక్షల చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ పరిహారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇరు కుటుంబాల్లోని పిల్లలు ఇంకా చిన్నవారేనని, ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి మరికొంత ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సబ్ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు వినతి



మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణకు వినతి పత్రం అందిస్తున్న జేఏసీ సభ్యులు

నిడదవోలు: పట్టణంలోని గణపతి సెంటర్‌లో చరిత్రాత్మక చిహ్నాలైన రాణి రుద్రమదేవి, వీరభద్ర భూపతి విగ్రహాలు ఏర్పాటు చేయాలని జేఏసీ సభ్యులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ అంశాన్ని కౌన్సిల్ సమావేశంలో అజెండాగా చేర్చి అనుమతులు ఇప్పించాలని కోరారు. జేఏసీ కన్వీనర్ జువ్వల రాంబాబు మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో విగ్రహాల ఏర్పాటుకు రాజకీయాలకు అతీతంగా పుర ప్రముఖులు, ప్రజాసంఘాల నేతలు ఏకగ్రీవంగా తీర్మానం చేశామని తెలిపారు. అనుమతి ఇవ్వగానే జేఏసీ సభ్యుల సొంత నిధులతో విగ్రహాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కడియాల రవిప్రసాద్, ఎండీ అక్రం, సంగాని నారాయణ, కేదారిశెట్టి వెంకటేశ్వరరావు, కేదారిశెట్టి రవికుమార్, బచ్చు సుమన్, అడ్డాల ప్రభాకర్, పోతుల సత్యనారాయణ, బొచ్చా కృష్ణ, కింజంగి గోపి, ఇమ్ము, రామ్‌దాస్ రామారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



జగన్నాథపురం రైతు భరోసా కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న మాధవరావు

గోపాలపురం: మనిషికి ఆరోగ్యం ఎంత ముఖ్యమో నేల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని అందుకే రైతులంతా తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు అన్నారు. మండలంలోని జగన్నాథపురం రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అన్నదాతలు మంచి దిగుబడులు పొందాలంటే తప్పనిసరిగా నేల ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. ఏటా వేసవి కాలంలో భూసార పరీక్షలు చేయించి అందుకు అనుగుణంగా పంటలు వేసుకోవాలని సూచించారు. ఉపాధి కూలీలను వ్యవసాయానికి అనుసంధానం చేయాలని తద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, మండల వ్యవసాయశాఖాధికారి బి.రాజారావు, సర్పంచ్ ఈడ్పిన రామసత్యవతి పాల్గొన్నారు.

వివాదాలకు తావిచ్చేలా వ్యవహరించొద్దు

కడియం: గ్రామాల్లో వివాదాలకు తావిచ్చేలా వ్యవహరించవద్దని ప్రజలకు కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ విజ్ఞప్తి చేశారు. కడియపులంక పంచాయతీ పరిధిలోని వెంకాయమ్మపేటలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు ధ్వంసం చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ తులసీధర్, ఎస్సై బి.నాగదుర్గాప్రసాద్ శనివారం వెంకాయమ్మపేట గ్రామస్తులతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసారు. తులసీధర్ మాట్లాడుతూ ఎవరు ఏ పార్టీలో ఉన్నా గ్రామ ప్రజలందరూ సోదర భావంతో మెలగాలని, ఒక పార్టీకి చెందిన వ్యక్తులు కట్టిన ఫ్లెక్సీలను మరో పార్టీకి చెందిన వారు ధ్వంసం చేయడం వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ నిఘా ఉంచామని, ఇటువంటి ఘటనలకు ఎవరైనా పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వెంకాయమ్మపేటలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ తులసీధర్